క్లుప్తంగా

గర్భిణులకు మెడికల్ కిట్లు



కిట్లు అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: మండల పరిధి ముద్వీన్ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ సహకారంతో బుధవారం గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ఇందులో వార్డు మాజీ సభ్యుడు మహేశ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు గోపాల్, మహేశ్, శ్రీశైలం, కృష్ణయ్య, రాములు, ఏఎన్ఎం పద్మ, అంగన్వాడీ ఉపాధ్యాయులు సునీత, హంసమ్మ, కిష్టమ్మ, ఆశ వర్కర్లు శ్యామలమ్మ, జ్యోతి, పద్మ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



లైట్లు ప్రారంభిస్తున్న నాయకులు

మాడ్గుల: మండలంలోని ఫకీరతండా గ్రామంలో ఎమ్మెల్యే నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బుధవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, చందు, జాను, నరెందర్, రాజు, హరిలాల్ పాల్గొన్నారు.

కార్మికులపై వేధింపులు తగవు



డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ కార్మికులపై.. యాజమాన్యం వేధింపులు మానుకోవాలని ఐక్య జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం డిపో ఎదుట సంస్థ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులపై యాజమాన్యం పని భారం మోపుతుందని ఆరోపించారు. కిలోమీటర్లను పెంచి, అక్రమ చార్జిషీట్లు జారీ చేస్తుందని, కేఎంపీఎల్, ఈపీకే తేవాలని ఒత్తిడి తెస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ వి.శ్రీనివాస్, కో–కన్వీనర్ జీఆర్ చందర్, పి.జంగయ్య, ఎండీ రజాక్, సత్తయ్య, సీహెచ్ పరమేశ్, మల్లేశ్, శ్రీశైలం, ప్రవీణ్, దర్శన్, యాదయ్య, వెంకటేశ్, సురేష్‌లు పాల్గొన్నారు.

పంటల సాగులో సూచనలు పాటించాలి

శాస్త్రవేత్త డాక్టర్ మహదేవప్ప

మొయినాబాద్‌రూరల్: రైతులు పంటల సాగులో అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ మహదేవప్ప, మండల వ్యవసాయ అధికారి అనురాధరెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేల సారవంతంగా ఉంటే పంటలకు మంచి దిగుబడి వస్తుందన్నారు. పచ్చిరొట్ట పైర్ల పెంపకం, నేల ఆరోగ్యాన్ని కాపాడడం, వివిధ పంటల సాగుపై అవగాహన కల్పించారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ సారి ముందుగానే పాఠ్య పుస్తకాలు అందనున్నాయి. పాఠశాలలు తెరవడానికి ఇంకా పదిహేను రోజుల సమయం ఉండగానే మండల వనరుల కేంద్రాలకు చేరిన పాఠ్యపుస్తకాలను బడులకు చేరవేస్తున్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మొత్తం 25,675ల పాఠ్యపుస్తకాలు అవసరం కాగా.. ఇప్పటికే 21,843ల పాఠ్యపుస్తకాలు మండల వనరుల కేంద్రానికి వచ్చాయి. అన్ని తరగతుల్లోని దాదాపు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు మండల విద్యాధికారి మల్లయ్య తెలిపారు. 6వ తరగతి గణిత శాస్త్రం, 6, 7, 8వ తరగతుల హిందీ పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందన్నారు. మండల వనరుల కేంద్రానికి వచ్చిన పాఠ్యపుస్తకాలను బుధవారం కొన్ని పాఠశాలలకు ఆటోల్లో చేరవేశారు. బంధించిన పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు మండల విద్యాధికారి మల్లయ్య తెలిపారు. 6వ తరగతి గణిత శాస్త్రం, 6, 7, 8వ తరగతుల హిందీ బుక్స్ రావాల్సి ఉందన్నారు. మండల వనరుల కేంద్రానికి వచ్చిన వాటిని బుధవారం కొన్ని పాఠశాలలకు ఆటోల్లో చేరవేశారు.

కల నెరవేరింది..

- పూర్తయిన కత్వావాగు వంతెన
- రూ.3.10 కోట్లతో నిర్మాణం
- ప్రారంభానికి సన్నాహాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు



ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా కత్వావాగుపై పూర్తయిన వంతెన

ఆమనగల్లు: గిరిజనుల కల నెరవేరింది. సుదీర్ఘ కాలం ఎదురు చూసిన మేడిగడ్డతండా– శంకరకొండతండాల మధ్య వాగుపై వంతెన నిర్మాణం పూర్తయింది. ప్రారంభానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో తండా వాసుల కష్టాలు తీరనున్నాయి.

రాకపోకలకు ఆటంకం

ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా నుంచి శంకరకొండతండాకు వెళ్లే మార్గంలో ఆమనగల్లు సురసముద్రం చెరువు ఉంది. వర్షాకాలంలో ఆ చెరువు నిండి అలుగుపారే సమయంలో కత్వవాగు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. దీంతో ఇరు తండాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. ఈ సమయంలో శంకరకొండతండా, సామాయిపల్లి తండా, చష్టతండా, దయ్యాలబోడుతండాల గిరిజనులు మండల కేంద్రానికి రాలేని దుస్థితి. ఈ నేపథ్యంలో ఈ వాగుపై వంతెన నిర్మించాలని దశాబ్దాల కాలంగా గిరిజనులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు.

దశల వారీగా పూర్తి

ప్రజల కోరిక మేరకు 2022లో పీఎంజీఎస్‌వై కింద ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.10 కోట్లు మంజూరు చేసింది. కానీ నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. దీనికి నిరసనగా.. ఆయా తండాల ప్రజలు ఆందోళనల బాట పట్టగా.. నాటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం యుద్ధ ప్రాతిపదికన కత్వవాగుపై నిర్మాణం పనులు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ పిల్లర్ల దశలో వదిలేశారు. దీంతో మరోసారి గిరిజనులు నిరసనలు వ్యక్తంచేయగా.. ఆరు మాసాల క్రితం నిర్మాణ పనులు మొదలు పెట్టి పూర్తిచేశారు.

వానాకాలం రాకముందే..



ప్రతి వర్షాకాలంలో మేడిగడ్డతండా– శంకరకొండ తండాల మధ్య కత్వావాగు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. దీంతో ఇరు ప్రాంతాల ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగేది. వంతెన కోసం సుదీర్ఘకాలం నిరసనలు వ్యక్తంచేశాము. ప్రభుత్వం స్పందించింది. మా కష్టాలు తీరనున్నాయి. వానాకాలం రాకముందే ప్రారంభిస్తే బాగుంటుంది.

– నరేశ్‌నాయక్, శంకరకొండతండా

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత



మంగళపల్లిలో కాజ్‌వే నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు జక్కు అనంతరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామ సమీపంలో మంగళపల్లి– చెన్నారం మార్గంలోని వాగుపై రూ.50 లక్షలతో చేపట్టే కాజ్‌వే నిర్మాణ పనులను బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. సందర్భంగా జక్కు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కాజ్‌వే నిర్మాణానికి ఎఫ్‌డీఆర్ ద్వారా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ మార్గంలో ప్రతి వర్షాకాలంలో ప్రాంత ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేదని, కాజ్‌వే నిర్మాణంతో ఆ కష్టాలు తీరనున్నాయని పేర్కొన్నారు. సీసీరోడ్లు, మురుగు కాల్వలు, నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు జంగయ్య, నాయకులు రాఘవేందర్, మల్లయ్య, కృష్ణారెడ్డి, గోపాల్, హర్షవర్ధన్‌రెడ్డి, తానయ్య, మండల పరిషత్ ఏఈ అభిషేక్, కార్యదర్శి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు దేవాలయ భూములకు వేలం

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల పరిధిలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన వ్యవసాయ భూములకు కౌలు వేలం వేయనున్నట్లు ఆలయ ఈఓ రామశర్మ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు 8 ఎకరాల 15 గుంటల వ్యవసాయ భూమికి రెండు సంవత్సరాలకుగాను కౌలు వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన రైతులు వేలంలో 3 వేల రూపాయలను డిపాజిట్ చేసి పాల్గొనాలని ఆయన కోరారు.

'చలో వరంగల్'ను విజయవంతం చేయండి

చేవెళ్ల: వరంగల్‌లో ఈ నెల 31న జరిగే ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని సమితి మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. చేవెళ్లలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు అందుకొని నేరుగా వరంగల్‌లో జరిగే జాతీయ కార్యవర్గ సమావేశానికి హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు స్వాగతం పలకడంతో పాటు జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో రావాలని కోరారు.

'ఉపాధి' సమస్యలు పరిష్కరించండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

- సీపీఎం మండల కార్యదర్శి రాములు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధి కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సీహెచ్ బుగ్గ రాములు డిమాండ్ చేశారు. బుధవారం కప్పపహాడ్, ఎల్మినేడు గ్రామాల్లో ఉపాధి పనులను పార్టీ జిల్లా నాయకుడు సీహెచ్ జంగయ్యతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న వారికి 4 నుంచి 6 వారాల బిల్లులు రాలేదని, వెంటనే వాటిని విడుదల చేయాలని కోరారు. కొలతల ప్రకారం కాకుండా, పని చేసిన వారం పూర్తి కాగానే.. బిల్లులు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు తగ్గించడం వలన కూలీలకు జాబ్‌కార్డులు, పని దినాలు తగ్గాయని, కొత్త కార్డులు, పే స్లిప్పులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. మెడికల్ కిట్లు అందజేయాని కోరారు. రోజు వారి కూలీ రూ.600 ఇచ్చి, 200 పని దినాలు కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు గణేశ్, మండల నాయకులు ప్రభుదాస్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం.. మటుమాయం

నిన్నమొన్నటి వరకు పచ్చదనంతో కళకళలాడిన రహదారి నేడు బోసిపోయింది. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని ఆ శాఖ సిబ్బంది.. రోడ్డు పక్కన ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతో మోడువారిన చెట్ల మొదళ్లతో దర్శనమిస్తోంది.

- విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని కొమ్మల నరికివేత
- దర్శనమిస్తున్న మొదళ్లు
- బోసిపోయిన రోడ్డు



కొమ్మల నరికివేతతో మోడుగా దర్శనమిస్తున్న మొదళ్లు

కడ్తాల్: పర్యావరణ రక్షణ, పచ్చదనం కోసం రహదారికి ఇరువైపులా పుష్కర కాలం క్రితం మొక్కలు నాటారు. అవి నేడు మానులై పచ్చదనం పంచడంతో పాటు, పలువురికి నీడను ఇస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుతున్నాయి. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ.. నేడు వాటి కొమ్మలు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని.. తొలగించడం పలు విమర్శలకు తావిస్తోంది.

సరఫరాకు ఆటంకంతో..

పన్నెండు సంవత్సరాల క్రితం రోడ్డుకు ఇరువైపులా మండల కేంద్రం నుంచి అన్మాస్‌పల్లి వెళ్లే దారిలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ మొక్కలు నాటించింది. ఆ సమయంలో రహదారి పక్కన విద్యుత్ లైన్ లేదు. ఆ మొక్కలు నేడు ఏపుగా పెరిగి నీడను నిస్తున్నాయి. ఐదారేళ్ల క్రితం విద్యుత్ సరఫరా కోసం ఆ శాఖ.. మొక్కల మీదుగా లైన్ తీసింది. ప్రస్తుతం ఆ చెట్లు ఏపుగా పెరిగి కరెంట్ వైర్లకు అడ్డుగా మారాయి. గాలులు వీచినప్పుడు, వర్షాలు కురిసినప్పుడు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో ట్రాన్స్‌కో అధికారులు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. ఇలా చెట్ల కొమ్మలను నరికి వేయడంతో పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మొక్కలు ఉన్నాయని తెలిసి కూడా వాటి పై నుంచి విద్యుత్ లైన్ ఎందుకు తీశారని ప్రశ్నిస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకోవాల్సి ఉండేదని పేర్కొంటున్నారు.

మొక్కలు నాటాకా.. లైన్‌తీత

చాలా చోట్ల విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటడం, అవి ఏపుగా పెరిగితే చెట్ల కొమ్మలను ట్రాన్స్‌కో సిబ్బంది కొట్టివేయడం చూస్తుంటాం. ఇక్కడ విచిత్రమేమిటంటే మొక్కలు నాటిన తర్వాత ఐదారేళ్లకు విద్యుత్‌లైన్ వేయడం, చెట్లు పెరిగాక కొమ్మలను నరకడం ట్రాన్స్‌కో అధికారుల పని తీరుకు దర్పణం పడుతోంది. విద్యుత్ లైన్ వేసినప్పుడే మొక్కలకు దూరంగా లైన్ వేసి ఉంటే, నేడు ఈ పరిస్థితి ఉండేది కాదుకదా పలువురు అభిప్రాయ పడుతున్నారు.

కరాటేలో విద్యార్థుల సత్తా

షాబాద్: కరాటే పోటీల్లో విద్యార్థులు సత్తాచాటారని సీఐ కాంతారెడ్డి, మాస్టర్ నర్సింహులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పీఆర్ఆర్ స్టేడియంలో కరాటే బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో 15 మంది విద్యార్థులు గ్రేడింగ్ ఉత్తీర్ణత సాధించి డబుల్ ప్రమోషన్, ఎల్లో జూనియర్ రెడ్ బెల్ట్ పొందారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

రోడ్డును ఆక్రమిస్తే చర్యలు

- కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి
- దుకాణాల ఎదుట బోర్డుల తొలగింపు



దుకాణాల ముందు ఉన్న బోర్డులను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుర్కయంజాల్: రోడ్డును ఆక్రమించి, దుకాణాల ఎదుట బోర్డులు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి హెచ్చరించారు. పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లి రోడ్డు, సాగర్ రహదారికి వరువైపులా ఉన్న దుకాణాల యజమానులు.. రోడ్డుపై ఏర్పాటు చేసిన బోర్డులను మున్సిపల్ సిబ్బంది బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రోడ్డును ఆక్రమించి తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం, నిర్మాణాలను చేపట్టడం ట్రాఫిక్ జామ్‌కు కారణం అవుతున్నారని, ఏడాది క్రితం ఇలాంటి వాటిపై కఠినంగా వ్యవహరించడంతో కొన్ని రోజుల పాటు ఇబ్బంది లేకుండా ఉందని వివరించారు. తిరిగి రోడ్లను ఆక్రమించడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులు అందాయని కమిషనర్ పేర్కొన్నారు. వ్యాపారులు సహకరించాలని కోరారు.

అధ్యక్ష పదవికి ఆరాటం..

- పెరుగుతున్న పోటీ దారులు
- కాంగ్రెస్‌లో అంతర్గత ముసలం!



మంచాల: అధికార పార్టీ కాంగ్రెస్‌కు మండలంలో గందరగోల పరిస్థితులు ఎదురవుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుడటం, దాంతో పాటే పార్టీ మండల అధ్యక్ష పదవి ఎన్నిక నేపథ్యంలో పార్టీ కుంపట్లో రాజకీయ సెగలు రాజుకుంటున్నాయి.

బలమైన శక్తిగా..

మంచాల మండలం.. జాతీయ పార్టీకి మునుపటి కంటే బలమైన శక్తిగా మారింది. గతంలో సీపీఎంకు కంచుకోటగా ఉండేది. ఆ పార్టీలో వచ్చిన నాయకత్వ విభేదాలు, ఆ పార్టీ బలహీన పడడానికి ప్రధాన కారణమైంది. టీడీపీ, బీఆర్ఎస్‌లు ఎలా ఉన్నా.. హస్తం హవా పెరిగింది. రాష్ట్రంలో అధికారంలోకి రావడమే కాకుండా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఆ పార్టీకి చెందిన మల్‌రెడ్డి రంగారెడ్డి చేజిక్కుంచుకోవడంతో, ఇతర పార్టీల నుంచి వలసలు ఊపందుకోవడంతో కాంగ్రెస్‌కు ఆదరణ పెరిగింది

నువ్వెంత అంటే నువ్వెంత

క్రమంగా పార్టీ బలపడినప్పటికీ.. అదే స్థాయిలో వర్గ విభేదాలు ఊపందుకున్నాయి. పార్టీలోకి వలసలు పెరగడంతో కొత్త, పాత వర్గం అంతర్గత ముసలం మొదలైనట్లు తెలుస్తోంది. కొత్తగా పార్టీలో చేరుతున్న వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని, ఏళ్లుగా పార్టీని నమ్ముకుని ఉన్నవారిని చిన్నచూపు చూస్తున్నారని సీనియర్లు బాహటంగానే ఆవేదన వ్యక్తం చేస్తుండటం గమనార్హం. అంతే కాకుండా ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం, నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఒంటెత్తు పోకడలు పెరుగుతుండటంతో పార్టీ పెద్దలు తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాలు, సంక్షేమ, అభివృద్ధి పనుల ప్రారంభంలోనూ పార్టీ శ్రేణులు.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకే పాల్గొంటున్నట్లు తెలుస్తోంది.

కత్తి మీద సాము

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవికి ఆశావహులు పెరిగారు. పది మంది వరకు తమ పేర్లను అధిష్టానం దృష్టికి తెచ్చారు. అయితే స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధ్యక్ష ఎన్నికలు అధికార పార్టీకి కత్తి మీద సాముల మారిందని రాజకీయ విశ్లేకులు అభిప్రాయ పడుతుండగా.. అందరినీ సమన్వయ పర్చి, విభేదాలు లేకుండా ముందుకు సాగేందుకు అధిష్టానం దృష్టి సారించింది. ఈ సంక్లిష్టమైన పరిస్థితుల్లో అధ్యక్ష ఎన్నికలు.. స్థానిక ఎన్నికలపై ఏ విధమైన ప్రభావం చూపనుందో చూడాలి.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించుకుందాం

మొయినాబాద్‌రూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం చేవెళ్ల నియోజకవర్గ నూతన అధ్యక్షుడు చేగూరి రాజు అన్నారు. బుధవారం మొయినాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. టీడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యదర్శిగా గోదావరి జయచంద్ర, కోశాధికారిగా ఆనంద్, ఉపాధ్యక్షులుగా మహేశ్, మనిమద్రి మురళీ, జూకంటి నరేందర్, సహాయ కార్యదర్శులుగా కర్రోళ్ల శ్రీధర్, జగదీశ్, గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రచార కార్యదర్శిగా శివగళ్ల శేఖర్, జిల్లా ప్రతినిధులుగా రఘునందన్‌గౌడ్, రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రమేశ్‌ను ఎన్నుకున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఐకమత్యంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకుంటామన్నారు.

నిబంధనల ప్రకారమే నిర్మాణం

- లబ్ధిదారులందరూ ఇంటిని నిర్మించుకోవాలి
- అర్హులు ఆందోళన చెందవద్దు
- అందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- ఇన్‌చార్జి ఎంపీడీఓలు శైలజ, జంగయ్యగౌడ్, నాయకులు



యాచారం: నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ తదితరులు

యాచారం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా ప్రారంభించాలని మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ అన్నారు. మండల పరిధి యాచారం, గాండ్లగూడెం, గడ్డమల్లయ్యగూడం, చౌదర్‌పల్లి గ్రామాల్లో బుధవారం ఇళ్ల నిర్మాణ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖ అధికారుల సూచనల ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని, లేని పక్షంలో బిల్లులు రావని తెలిపారు. తొలి విడతగా పలువురు అర్హులకు ఇళ్లు మంజూరు అయ్యాయని, లబ్ధి చేకూరని వారు ఆందోళన చెందవద్దని, విడతల వారీగా ప్రభుత్వం ఇల్లు కేటాయిస్తుందని పేర్కొన్నారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ నాయిని సుదర్శన్‌రెడ్డి, జీపీ కార్యదర్శి తిరుపతయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



ఆమనగల్లు: చంద్రాయణపల్లి తండాలో..

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని, పేదవారి సొంతింటి కల సాకారమవుతుందని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ చంద్రాయణపల్లి తండాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం మంజూరు పత్రాలు అందజేశారు. పలు ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం.. డబుల్‌బెడ్‌రూం పేరుతో ప్రజలను మోసం చేసిందని, ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు అర్హులందరికీ ఇళ్లు కేటాయిస్తుందని పేర్కొన్నారు. తొలి విడతలో రాని వారు ఆందోళన చెందవద్దని, రెండో విడతలో ఇస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు రాగ్యానాయక్, శ్రీనునాయక్, శ్రీధర్‌నాయక్, హర్యానాయక్, గోపాల్‌నాయక్, మల్లేశ్, రమేశ్, హేమ్లా, సోమ్లనాయక్, గోపినాయక్, కవిత పాల్గొన్నారు.

14వ వార్డులో..

మున్సిపాలిటీ పరిధి 14వ వార్డులో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

60 గజాల్లో..

మంచాల: అరవై గజాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం మంచాల మండలం తాళ్లపల్లి గూడ గ్రామంలో ఆమె ఇంటి నిర్మాణ పనులను ముగ్గు పోసి ప్రారంభించి మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలను ప్రభుత్వం విడతల వారీగా మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



తాళ్లపల్లిగూడలో నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్యదర్శి

నాణ్యతగా ఉండాలి



తులేకలాన్ గ్రామంలో.. ఇన్‌చార్జి ఎంపీడీఓ జంగయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలని ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎల్లంకి జంగయ్యగౌడ్ అన్నారు. మండలంలోని తులేకలాన్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన ప్రతి ఒక్కరూ నిర్మాణం చేసుకోవాలని సూచించారు. రమేష్ మాట్లాడుతూ.. మొదటి విడతలతో 37 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో మరిన్ని ఇళ్లు మంజూరు చేయించి, నిరుపేదలకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి మల్లేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శశాంక్‌రెడ్డి, పాండు, కలకొండా కృష్ణ, యాదగిరి, నర్సింహ, మహేందర్, బన్నీ, వెంకటేశ్, పాండు, ప్రభు, సాయి పాల్గొన్నారు.